సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 2 । జూలై । 2024



కలుషిత నీరు తాగి అస్వస్థత

ఉపాధ్యాయులు, అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. కలుషిత నీటిని తాగడం వల్ల విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. - 8లో



చట్టాలపై అవగాహన అవసరం

నూతన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /23.8

జిల్లాలో సోమవారం 23.8- 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంలో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

10లోపు డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల రుసుము చెల్లించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు రుసుములు చెల్లించి ఆన్లైన్ దరఖాస్తులు సమర్పించాలని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. 1,2,3,4 సెమిస్టర్లలో ఒక్కో పేపర్, 5 సెమిస్టర్ అన్ని పేపర్లు రాసుకునే అవకాశం కల్పించామన్నారు. పరీక్ష రుసుం పేపర్‌కు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్లైన్ అప్లికేషన్లు వైవీయూ ఎగ్జామ్స్ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్నల్, ప్రాక్టికల్ ఎగ్జామినేషన్స్ అలానే ఇంటర్న్ షిప్ పూర్తి చేయనివారు ఇన్‌స్టంట్ ఎగ్జామ్ రాసేందుకు అర్హులు కాదన్నారు.

సీపెట్ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి అవకాశం

కడప ఎడ్యుకేషన్ : భారత ప్రభుత్వ విద్యా సంస్థ సీపెట్‌లో ఉద్యోగ కల్పనే లక్ష్యంగా 10వ తరగతి సప్లిమెంటరీ పాస్ అయిన విద్యార్థులకు మూడేళ్ల వ్యవధిగల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ, విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి ఉందని తెలిపారు. నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ సదుపాయం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు విధానం.. ఇతర వివరాల కోసం 6300147965 నెంబర్‌ను సంప్రదించాలని సీపెట్ జాయింట్ డైరెక్టర్ శేఖర్ తెలిపారు.

పాడా ఇన్‌చార్జ్ ఓఎస్డీగా వెంకటరావు



పులివెందుల : పులివెందుల అర్బన్ డెవలప్మెంట్ ఏజెన్సీ (పాడా) ఇన్‌చార్జ్ ఓఎస్డీగా వెంకటరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఓఎస్డీగా పనిచేస్తున్న అనిల్ కుమార్‌రెడ్డి విజయవాడలోని జేఏడీలో రిపోర్టు చేశారు. ఇన్‌చార్జ్ ఓఎస్డీగా బాధ్యతలు చేపట్టిన వెంకటరావు కడపలోని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతుండగా పాడా ఓఎస్డీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పాడా ఏఓ రామాంజనేయరెడ్డి, అకౌంటెంట్ నీలకంఠారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు.

'ఓపెన్' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

– పదిలో 61.74 శాతం, ఇంటర్‌లో 73.3 శాతం ఉత్తీర్ణత

కడప ఎడ్యుకేషన్ : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్‌స్కూల్ పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం సాయంత్రం ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో పదవ తరగతికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 745 మంది అభ్యాసకులు పరీక్షలు రాయగా వారిలో 460 మంది పాసై 61.74 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అలాగే ఇంటర్మీడియట్‌కు సంబంధించి జిల్లాలో 1338 మంది అభ్యాసకులు పరీక్షలు రాయగా వారి లో 951 మంది పాసై 73.32 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. పరీక్షా ఫలితాల్లో ఏవైనా సందేహాలు ఉన్నా అభ్యాసకులు రీ వెరిఫికేషన్ లేదా రీ కౌంటింగ్‌కి సంబంధించి రుసుం చెల్లించడానికి ఈనెల 13వ తేదీ వరకు గడువు ఉందని ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. సంబంధిత ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని ఆయన తెలిపారు. అలాగే అభ్యాసకులు వారి హాల్‌టికెట్ నెంబర్‌తో ఫలితాలను డౌన్లోడ్ చేసుకోవచ్చని కేవీ సుబ్బారెడ్డి తెలిపారు.

విద్యార్థుల మానసిక స్థితిని తెలుసుకుని బోధనలు చేయాలి

రాజంపేట టౌన్ : తరగతి గదిలో విద్యార్థుల మానసిక స్థితిని తెలుసుకొని ఉపాధ్యాయులు బోధనలు చేయాలని ఆర్జేడీ రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని బోయినపల్లె జెడ్పీ హైస్కూల్‌లో టీచ్ టూల్స్‌పై సోమవారం ప్రారంభమైన శిక్షణా కార్యక్రమంలో ఆర్జేడీ పాల్గొని మాట్లాడారు. తొమ్మిదిరోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకునే అంశాలను ఉపాధ్యాయులు విధిగా తరగతి గదిలో పాటించాలన్నారు. బోధన చేసే సమయంలో పిల్లలు పాఠాన్ని శ్రద్ధగా వింటున్నారా లేదా అన్న విషయాన్ని కూడా ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. తరగతి గదిలోని విద్యార్థులంతా ఏకాగ్రతతో పాఠం వింటే హైగ్రేడ్‌గా, సగం మంది మాత్రమే వింటే మీడియం గ్రేడ్‌గా, ఒకరిద్దరు మాత్రమే పాఠం వింటే లోగ్రేడ్‌గా పరిగణించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై బోధనలు చేయాలని, అదే సమయంలో వారిపై అజమాయిషీ కూడా ఉండాలన్నారు. తొమ్మిది రోజుల శిక్షణ అనంతరం ఉపాధ్యాయులకు పరీక్ష ఉంటుందని, ఆ పరీక్షలో ఉపాధ్యాయులు విధిగా ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె

- కోర్సుల్లో ప్రవేశాలకు సమయం ఆసన్నం
- ప్రారంభమైన ఈఏపీసెట్ ప్రవేశాల ప్రక్రియ
- 1 నుంచి ప్రారంభం.. 22వ తేదీతో ముగింపు



కడపలో హెల్ప్‌లైన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల ఉజ్వల భవితకు ఇంజినీరింగ్ కోర్సులు వారధిగా నిలుస్తున్నాయి. దశాబ్దాలుగా సాంకేతిక రంగంలో నెలకొన్న విప్లవాత్మక మార్పులతో ఇంజినీరింగ్ విద్యపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆసక్తిని చూపుతున్నారు. ఇంజినీరింగ్ కోర్సు పూర్తికాగానే కార్పొరేట్ సంస్థల్లో సాఫ్ట్‌వేర్ కొలువులు, లక్షల్లో ప్యాకేజీలతోపాటు విస్తృత అవకాశాలు ఉండటంతో ఇంజినీరింగ్‌కు ఏటా క్రేజ్ పెరుగుతూనే ఉంది. తాజాగా ఈఏపీ సెట్ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కళాశాలలతోపాటు కోర్సుల ఎంపిక కీలకంగా మారింది. ఏ కోర్సు చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఏ కళాశాలలో అయితే భవిత బాగుంటుందనే విషయ సేకరించే పనిలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు

ఇంజనీరింగ్‌లో సీఎస్‌సీదే పైచేయి...

ఇంజనీరింగ్ విద్యలో ముఖ్యంగా సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో సీఎస్ఈ బ్రాంచ్‌కు యమా క్రేజ్ ఉంటుంది. ఈ గ్రూపునకే విద్యార్థులు తొలి ప్రాధాన్యమిస్తారు. ఐటీ కొలువులకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు ఉండటమే ఇందుకు కారణం. రెండవ ప్రాధాన్యత ఈసీఈ బ్రాంచ్‌కు ఉంటుంది. ఈ కోర్సుతో ఎలక్ట్రికల్ పరికరాలు, అన్‌లాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్, శాటిలైన్ కమ్యూనికేషన్, మైక్రోవేవ్ ఇంజనీరింగ్, మైక్రోప్రాసెస్‌తోపాటు పలు అంశాలపై బోధనలు ఉంటాయి, కోర్ సెక్టార్‌తోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలోను కొలువులకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఈ కోర్సుకు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. ఇక మూడోది సివిల్ బ్రాంచి. ఈ సివిల్ కోర్సులో నిర్మాణ రంగంలో ఉద్యోగాలతోపాటు సొంతంగా కన్సెల్టెన్సీలు ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందవచ్చు. అలాగే మెకానికల్ ఇంజనీరింగ్‌కు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. అలాగే ఆటోమొబైల్స్,ఎలక్ట్రికల్ మెటార్లు రంగంలో రాణించడంతో ఈ గ్రూపుకు కూడా మంచి డిమాండే ఉటుంది.

కొత్త బ్రాంచులు అందుబాటులోకి..

జిల్లాలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు కొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. సీఎస్ఈలో ఏఐ, మెషన్ లర్నింగ్, సైన్సు రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేర్, మెరైన్ , మైనింగ్ వంటి కొత్త బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి. మంచి ర్యాంకులు వచ్చిన చాలా మంది విద్యార్థులు ఫస్ట్ ఆప్షన్ కింద సీఎస్‌సీ గ్రూపుల్లో చేరేందుకు అసక్తి కనబరచగా రెండవ ఆప్షన్ కింద ఈసీఈలో చేరేందుకు ఆసక్తి చూపుతారు.

జిల్లాలో కళాశాలల వివరాలు ఇలా..

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. వైఎస్సార్‌జిల్లాలో 16 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా ఇందులో 6615 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే జేఎన్‌టీయూ పరిధిలో ఒక ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల ఉండగా అందులో 300 సీట్లు, అలాగే కడప వైవీయూ పరిధిలో ఓ గవర్నమెంట్ ఇంజనీరింగ్ కళాశాల ఉండగా అందులో 253 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా ఈ ఏడాది ఇంకా కొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి



ఈఏపీ సెట్‌లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నుంచి ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక సమయంలో విద్యార్థి దగ్గరుండి స్వయంగా చూసుకోవాలి. స్నేహితులు, మరొకరు సహకారంతో ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తే తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. విద్యార్థులే స్వయంగా వెళ్లి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో ఏదైనా సమస్యలుంటే హెల్ప్‌లైన్ కేంద్రానికి రావచ్చు.
– సీహెచ్ జ్యోతి, హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప.

ఇవి చూసుకోవాలి..

విద్యార్థులు కళాశాలల్లో చేరేముందు నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపులు ఉన్నాయా లేదా అని గమనించాలి. దీంతోపాటు ప్రవేశాలు, ప్లేస్‌మెంట్ ఎలా ఉన్నాయనే విషయాలను ఆరా తీసి పూర్వపు విద్యార్థుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా చేరితే మంచిది. కళాశాల మీద అవగాహన లేకుండా చేరడం వల్ల భవిష్యత్తులో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. బ్రాంచ్ కంటే కూడా కళాశాల ఎంపికే కీలకమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

- cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈఏపీ సెట్-24 అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి.
- వచ్చిన రిజిస్ట్రేషన్ ఫారంతో హాల్‌టికెట్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించాలి. అందులో సమాచారం క్షుణంగా నింపి సబ్‌మిట్ కొట్టాలి.
- 10వ తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, రేషన్‌కార్డు జిరాక్స్ అప్‌లోడ్ చేయాలి.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా..

- గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ రుణ పత్రం గలవారికి 10 శాతం రిజిస్ట్రేషన్ అమలు చేస్తున్నారు.
- ఈ నెల 1 నుంచి జులై 7 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- ఇందులో వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1200, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ. 600 ఫీజును ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డు లేదా డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకు ద్వారా ఫీజును చెల్లించాలి.
- ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరుగుతుంది.
- జులై 8 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 13వ తేదీ వెబ్ ఆప్షన్లు మార్పునకు అవకాశం
- 16న సీట్లు కేటాయింపు, 17వ తేదీ నుంచి 22వ తేదీ మధ్యలో కళాశాలల్లో రిపోర్టింగ్
- జులై 17వ తేదీ నుంచి ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

– కలెక్టర్ విజయరామరాజు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ హాలులో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించి పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ, ఐసీడీఎస్ పీడీలు ఆనంద్ నాయక్ హాజరయ్యారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారిగా సుభాషిణి నియామకం



కడప అగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ అధికారిగా (ఫుల్ అడిషనల్ చార్జు) ఎస్ ఎస్‌వీ సుభాషిణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె సోమవారం కడపలోని జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో జిల్లా ఉద్యానశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలతోపాటు పండ్లతోటల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో జిల్లా ఉద్యానశాఖ అధికారిగా పనిచేస్తున్న మైఖేల్‌రాజీవ్ ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సుభాషిణిని ఎఫ్ఏసీ ఉద్యానశాఖ అధికారిగా ప్రభుత్వం నియమించింది.

జిల్లా అంతటా వర్షం

- ఖాజీపేటలో అత్యధికంగా 44.6 మి.మీ వర్షం
- పంటలసాగుకు మరింత ఊతం

మండలం	నమోదైనవర్షం మిల్లీమీటర్లలో	మండలం	నమోదైనవర్షం మిల్లీమీటర్లలో
ఖాజీపేట	44.6	చక్రాయపేట	11.0
బద్వేల్	39.6	కలసపాడు	10.6
వల్లూరు	31.6	కాశినాయన	10.4
బిమఠం	31.2	ఎర్రగుంట్ల	10.0
మైదుకూరు	29.4	సిద్ధవటం	9.4
వీఎన్‌పల్లి	29.4	కడప	8.4
పెండ్లిమర్రి	29.2	బి.కోడూరు	8.4
చెన్నూరు	26.0	వేంపల్లి	8.2
గోపవరం	24.8	పోరుమామిళ్ల	7.2
పెండ్లిమర్రి	22.0	తొండూరు	4.6
వేముల	22.0	జమ్మలమడుగు	2.2
చాపాడు	18.2	ఒంటిమిట్ట	2.0
సికెదిన్నె	14.4	ముద్దనూరు	1.2
కమలాపురం	12.6	కొండాపురం	1.2

కడప అగ్రికల్చర్ : నైరుతి రుతుపవనాల ఆగమనంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ఈ వర్షం రైతుల పంటల సాగుకు మరింత ఊతం ఇవ్వనుంది. ఇప్పటికే చాలామంది రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేశారు. ఈ వర్షం పచ్చిరొట్ట విత్తనాలు ఏపుగా పెరిగేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే చాలా ప్రాంతాల్లో పత్తి, వేరుశన, మినుము, సజ్జ, మొక్కజొన్న వంటి పంటలను కూడా సాగు చేస్తున్నారు. వాటికి కూడా ఉపయోకరంగా ఉంటుంది. వీటితోపాటు ప్రస్తుతం చాలామంది రైతులు ఈ వర్షంలో మరింత విస్తీర్ణంలో పంటలను సాగు చేయనున్నారు. జిల్లాలో ఖాజీపేటలో అత్యధికంగా 44.6 మి.మీవర్షం కురిసింది.

పింఛన్‌పెంపు కార్యక్రమంలో ప్రోటోకాల్ విస్మరణ

- ఎమ్మెల్యే పుట్టా సమావేశంలో అంతా తానై వ్యవహరించిన మాజీ సెక్రటరీ
- చూస్తుండిపోయిన మండల స్థాయి అధికారులు



ఎన్టీఆర్ భరోసా పింఛను పెంపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ పీఎస్ శ్రీనివాసులు



అన్నవరం గ్రామ సచివాలయం వద్ద శ్రీనివాసులు పేరుతో ఏర్పాటైన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్ జిల్లా అన్నవరం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛను పెంపు కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించాల్సిన ఈ ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో వేదిక మీద, కింద టీడీపీ నాయకులు, కార్యకర్తలే కన్పించారు. ప్రొటోకాల్ అనే మాటే లేకుండా అధికారులు కార్యక్రమాన్ని ముగించేశారు. శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిధిగా నిర్వహించిన ఈ ప్రభుత్వ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కార్యక్రమాన్ని ముగించి అధికారులు మమ అన్పించారు.

అంతా తానై వ్యవహరించిన మాజీ పీఎస్

అన్నవరం గ్రామ సచివాలయం వద్ద సోమవారం జరిగిన ఎన్టీఆర్ పింఛను పెంపు కార్యక్రమంలో ఐదు నెలల క్రితం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి శ్రీనివాసులు అంతాతానై అత్యుత్సాహం ప్రదర్శించారు. విధుల నిర్వహణలో ప్రవర్తన బాగా లేని కారణంగా మార్చి నెలలో జిల్లా కలెక్టర్ విజయరామరాజు పనిష్మెంట్ క్రింద కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లె సచివాలయానికి బదిలీ చేశారు. అయితే సోమవారం ఉన్నట్టుండి అన్నవరంలో సచివాలయంలో ప్రత్యక్షమయ్యాడు. పలువురు అధికారులు శ్రీనివాసులను ప్రశ్నించగా తాను అన్నవరానికి బదిలీ అయ్యాయని ఉత్తర్వులు ఉదయం 10గంటల్లోపు వస్తాయని బుకాయించారు. అంతతో ఆగకుండా ఎమ్మెల్యే వేదికపై ఉండగా అంతా తానే అన్నట్లుగా ప్రసంగించటం, ఇదే క్రమంలో తనను గ్రామస్థులు మళ్లీ సెక్రెటరిగా ఆహ్వానించినట్లు శ్రీనివాసులు ఫొటోలో భారీ ఫ్లెక్సీని సైతం ఏర్పాటు చేయించుకున్నాడు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు చూస్తూ ఉండిపోగా, టీడీపీ కార్యకర్తలు, గ్రామస్తులు శ్రీనివాసులు తీరుపై ఆశ్చర్యకితులుగా చూస్తుండిపోయారు. శ్రీనివాసులు బదిలీ అయినట్లు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని ఎంపీడీఓ విలేకరులతో చెప్పటం గమనార్హం.

పండుటాకులపై టీడీపీ కక్ష!



ఇక్కడ కన్పిస్తున్న వ్యక్తి పేరు పి.నరసింహులు. టీఓపల్లె గ్రామానికి చెందిన ఇతను 2014 టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి డప్పు కళాకారుడిగా పింఛన్ పొందుతున్నాడు. కొన్నేళ్ల క్రితం కాలుకు ప్రమాదం జరిగింది. పింఛన్ డబ్బులు మీదే ఆధారపడి భార్యను పోషించుకుంటున్నాడు. 'గత నెల వరకూ పింఛన్ వచ్చింది.. ఈ నెలలో ఇవ్వలేదు. ఇదేమనడిగితే ఉన్నతాధికారులు ఆపమన్నారని చెబుతున్నా'రని వాపోయాడు.



ఇక్కడ కన్పిస్తున్న వ్యక్తి పేరు ఆలూరు సీతారాములు. టీఓపల్లె పంచాయతీ రేవపల్లెకు చెందిన ఇతనికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇస్తున్న రూ.200ల వికలాంగ పింఛన్ పొందుతున్నాడు. గత నెల వరకూ వికలాంగత్వ పింఛను పొందాడు. ఈ నెలలో పింఛన్ కోసం వెళ్లగా తనకు ఇవ్వడం లేదని వాపోయాడు. తన వికలాంగ సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాతే ఇస్తామని అధికారులు చెబుతున్నారని. కావాలనే గ్రామంలోని టీడీపీ నాయకులు తన పింఛను ఆపిస్తున్నారని, తన చేతిని చూసి కూడా పింఛన్ ఆపటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశాడు.

- ఎమ్మెల్యే పుట్టా ఫిర్యాదుతో 94 మందికి అందని పింఛన్
- పింఛన్ పంపిణీని ఆపించిన ఎంపీడీఓ రహంతుల్లయ్య
- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు



తమ పింఛన్లను ఎందుకు ఆపారని పంచాయతీ కార్యదర్శి వద్ద వాపోతున్న బాధితులు

చాపాడు : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామని టీడీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. 'మీ భద్రతే .. మా బాధ్యత' అంటూ ఊదరగొట్టింది. అవన్నీ మాటలకే అంటూ మరోసారి రుజువు చేసింది. అన్ని అర్హతలున్నా పింఛన్ ఇవ్వకుండా నిరుపేద పండుటాకులకు, దివ్యాంగులకు మోసం చేసింది. మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలోని మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామ పంచాయతీలో 94 మంది పింఛన్ దారులకు డబ్బులు పంపిణీ చేయకుండా వారి కన్నీళ్లకు కారణమైంది. స్వయానా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మూడు పంచాయతీలకు చెందిన 94 మంది పింఛన్‌దారులకు అర్హతలను పునర్విచారణ చేసిన తర్వాతనే డబ్బులు పంపిణీ చేయాలని కలెక్టర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం జరిగిన పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన 94 మందికి పింఛన్ డబ్బులను ఆపాలని ఎంపీడీఓ రహంతుల్లయ్య ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం తెల్లవారుజాము నుంచి పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూసిన సదరు లబ్ధిదారులకు నిరాశ ఎదురైంది. పదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నామని ఈ సారి తమకెందుకు పింఛన్ డబ్బులు ఇవ్వలేదని, తామేమి పాపం చేశామని బాధితులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులన్న కారణంగా పింఛన్లు ఆపారని ఆయా గ్రామాల్లో చర్చించుకుంటున్నారు.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామాల్లో 94మందికి పింఛన్‌లను ఆపడంపై ఎంపీడీఓ రహంతుల్లయ్యను వివరణ కోరగా.. ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, డీఆర్‌డీఏ పీడీ నుంచి 94 మంది పింఛన్లను వెరిఫికేషన్ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. రెండు మూడు రోజుల్లో వెరిఫికేషన్ చేసిన తర్వాత పింఛన్ల పంపిణీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పింఛన్ డబ్బులు అందని బాధితులు..

మండలంలోని మడూరు పంచాయతీలో వృద్ధాప్య పింఛను పొందుతున్న ఎం.శివారెడ్డి, మబ్బులు, కె.మహమ్మద్ షరీఫ్, మాలబాల సుబ్బారెడ్డి, కట్టుబడి సాసేన్ వలి, మాబు షరీఫ్, సాకం చిన్న సుబ్బారెడ్డి, పర్లపాటి షేక్ రసూల్, బాషా, రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, కల్లిగాల్ల చెన్నమ్మ, చంటి సుబ్బయ్య, ఆవుల గుర్రప్ప, కాలేబు, సొనెపల్లె బయపురెడ్డి, లక్షుమ్మ, ఆళ్లగడ్డ దానం, బొగ్గుల రాజమ్మ, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, శేషారెడ్డి, పెద్ద లక్ష్మీరెడ్డి, వికలాంగులైన లక్ష్మీప్రియ, సాకం నాగసూయమ్మ, సుభానీ, మహబూబ్ బాషా, రంగాగాళ్ల లలితమ్మ, సుబ్బమ్మ, డప్పు పింఛన్‌దారులు సుబ్బరాయుడు, కల్లగాల్ల సుబ్బరాయుడు, చిన్నటిగాళ్ల సుబ్బరాయుడు, చెప్పులు కుట్టేవారు అంకన్న, పెద్ద ఓబయ్య, బాల ఓబయ్య, అభయహస్తం, వితంతువు మునెమ్మ ఉన్నారు. అలాగే అన్నవరంలో.. వృద్ధాప్య పింఛన్ దారులు పల్లవోలు ప్రసాద్‌రెడ్డి, ఆలూరు పీరయ్య, బాషా, వీరనారాయణ, గంగిరెడ్డి, నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, కుల్లాయిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పెద్ద కొండారెడ్డి, కాసా వెంకటసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, సంజీవరెడ్డి, జాకోబ్, చిన్న సుబ్బరాయుడు, వికలాంగులైన ఆదినారాయణరెడ్డి, చింతకుంట షైద్దీన్, ఇందిరమ్మ, కానాల మేరి, గంగయ్య, రామిరెడ్డి, రామ ఓబులరెడ్డి, అశ్వని, రామసుబ్బమ్మ, బంక మమత, చేనేత నారాయణ పింఛన్ ఆపేసిన వారిలో ఉన్నారు. టీఓపల్లెలో.. వృద్ధాప్య పింఛన్ పొందుతున్న చెన్నూరు సుబ్బమ్మ, వీరమ్మ, సుబ్బారెడ్డి, ఏ.వెంకటసుబ్బారెడ్డి, కుంచెం సుబ్బ మ్మ, పిచ్చయ్య, మద్దిలేటి, రామయ్య, వెంకటసుబ్బ య్య, శివారెడ్డి, గంగమ్మ, కొండారెడ్డి, వికలాంగులైన సాంబశివారెడ్డి, శ్రీదేవి, తిరుపాలమ్మ, గురుస్వామి, రంగరాజు, సాంబశివారెడ్డి, డప్పు కళాకారులు వెంకటసుబ్బయ్య, చిన్నమ్మ, నరసింహులు, రాముడు, చేనేతలైన సుబ్రమణ్యం, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడులకు పింఛన్ డబ్బులను ఆపారు.

76 ఏళ్లు ఉన్నా వృద్ధాప్య పింఛన్ ఆపడం న్యాయమా



పదేళ్లుగా వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాను. గతంలో టీడీపీ, గత ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా పింఛన్ సజావుగా ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో రావటం మొదటి నెలే నాకు పింఛను ఇవ్వకుండా ఆపటం ఎంత వరకు న్యాయం. 76 ఏళ్లు ఉన్న నా పత్రాలను పరిశీలించిన తర్వాతనే ఇస్తామని చెప్పటం బాధాకరం.
– ముదిరెడ్డి శివారెడ్డి, వృద్ధుడు, మడూరు గ్రామం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు సమీపంలో సీయోనుపురంలో ఆదివారం రాత్రి డబ్బుల విషయంపై ఘర్షణ పడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సాకె గురుప్రసాద్, తెలుగుదేశం పార్టీకి చెందిన గౌస్‌కు డబ్బులిచ్చాడు. ఈ నేపథ్యంలో గురుప్రసాద్ ఇంటికి గౌస్ వెళ్లి ప్రస్తుతం మా ప్రభుత్వం అధికారంలో ఉంది... మమ్మల్నే డబ్బులు అడుగుతావా అంటూ అతనిని చితకబాదాడు. దీంతో గాయపడిన గురుప్రసాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగడి వీధి గ్రామానికి చెందిన దూదేకుల మహబూబ్ చాంద్(17) అనే విద్యార్థిని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సీకేదిన్నె సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన మహబూబ్ చాంద్ చింతకొమ్మదిన్నె మండలంలోని అంగడి వీధి గ్రామంలో గల తన చిన్నమ్మ వద్ద ఉంటూ కడప నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు ఆమెను మందలించడంతో మనస్థాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో మాత్రలు మింగింది. చికిత్స నిమిత్తం ఏలూరు సీఎంసీకి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. మృతురాలి చిన్నాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చదరంగంలో చిన్మయ ప్రతిభ



పసుపులేటి చిన్మయ

కడప స్పోర్ట్స్ : కడప నగరం ఎన్‌జీఓ కాలనీకి చెందిన పి. ఉమామహేశ్వర్, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె అయిన పసుపులేటి చిన్మయ చదరంగం క్రీడలో రాణిస్తోంది. విద్యామందిర్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఈ చిన్నారి అండర్–10 విభాగం నుంచి చదరంగం ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో 1523 రేటింగ్ సాధించింది. గతనెలలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిడే ఓపన్ రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్–2024లో ఈమె పాల్గొని 10 పాయింట్లకు గాను ఐదున్నర పాయింట్లు సాధించింది. తాజాగా సోమవారం జారీ చేసిన రేటింగ్స్‌లో ఈ చిన్నారికి 1523 రేటింగ్‌ను ప్రకటించారు. కాగా ఈమె తిరుపతికి చెందిన చదరంగం శిక్షకుడు అరుణ్‌కుమార్ వద్ద శిక్షణ పొందింది.

కలుషిత నీరు తాగి విద్యార్థులకు అస్వస్థత

- 30 మంది ఆసుపత్రిపాలు
- ఆరుగురికి రిమ్స్‌లో చికిత్స
- ట్యాంకులను క్లోరినేషన్ చేసిన వైద్య సిబ్బంది



విద్యార్థులను పరిశీలించి చికిత్స చేస్తున్న వైద్యులు



విద్యార్థినుల కేస్ షీట్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

ఖాజీపేట : ఉపాధ్యాయులు, అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. కలుషిత నీటిని తాగడం వల్ల విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

వివరాలిలా.. ఖాజీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంచినీటిని తాగేందుకు సుమారు 4 ట్యాంకులు ఉన్నాయి. అందులో రెండు ట్యాంకుల నుంచి వచ్చే నీటిని చేతులు కడుక్కోవడానికి మరో రెండు ట్యాంకుల నుంచి వచ్చే నీటిని తాగేందుకు వాడుతుంటారు. అయితే కొద్ది కాలంగా ఈ ట్యాంకులకు పైన మూతలు లేవు. ఫలితంగా ట్యాంకుల్లో గత నాలుగు రోజుల నుంచి కోతులు దూకి స్నానం చేయడం అక్కడే వ్యర్థాలను వదిలేయడం జరుగుతోంది. గాలికి వచ్చిన ఆకులు, దుమ్ము అంతా ఆ ట్యాంకుల్లోనే పేరుకుపోతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు భోజనం తిన్న తరువాత, లేదా దాహం వేసినప్పుడు ఆ నీటినే తాగుతూ వచ్చారు. దీంతో గత మూడు రోజుల నుంచి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

30 మంది విద్యార్థులకు అస్వస్థత

బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులు శుక్ర, శని, సోమవారం రోజులు అదే నీటిని తాగడం వల్ల సుమారు 30 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రోజున బాలికల వసతి గృహం నుంచి సుమారు 10 మంది విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పితో పాటు జ్వరం రావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. సోమవారం రోజు ఉదయం 9గంటల నుంచి బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తీవ్ర కడుపు నొప్పి, వాంతులు రావడం అధికమైంది. సుమారు 15 మంది ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో పాఠశాలకు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి తోపాటు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆరుగురు విద్యార్థులు కడప రిమ్స్‌కు వెళ్లారు. అందులో ఒక విద్యార్థి ఐసీయూలో ఉండగా మరో ఇద్దరిని జనరల్ వార్డుకు తరలించారు.

వైద్య శిబిరం..

విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వ వైద్య సిబ్బంది. పాఠశాలలోనే వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఆయిషా సుల్తానా విద్యార్థులకు చికిత్స చేశారు. విద్యార్థులు కాచి చల్లార్చిన నీటిని వాడాలని సూచించారు.

ట్యాంకుల క్లోరినేషన్

బాలికల వసతి గృహం నుంచి సమస్య ఉందని ఖాజీపేట వైద్య సిబ్బంది వెళ్లి అక్కడి పరిసరాలను పరిశీలించారు. సమస్య అక్కడ లేదని గుర్తించి. బాలికల హైస్కూల్‌లో పరిశీలించారు. విద్యార్థులు తాగే నీటి ట్యాంకులకు మూతలు లేక పోవడం, నీరు అపరిశుభ్రంగా ఉండటం గుర్తించారు. వెంటనే నిల్వ నీటిని తొలగించి క్లోరినేషన్ చేశారు. నీటి ట్యాంకులకు మూతలు వేసుకోవాలని సూచించారు.

పనిచేయని నీటి శుద్ధి పరికరాలు

బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచి నీరు అందించేందుకు నీటిశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ యంత్రాలకు మరమ్మతులు చేయక పోవడం వల్ల పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. నాబార్డు నిధుల ద్వారా పాఠశాలలో మరమ్మతు పనులు చేస్తున్నారు. అయితే నీటి శుద్ధి యంత్రాలు కొత్తవి వస్తాయని భావించారు. కానీ రాక పోవడంతో పంచాయతీ నుంచి వచ్చే నీటిని ట్యాంకుల ద్వారా వాడుతున్నారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం

గత మూడు రోజుల నుంచి విద్యార్థినులు వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతుంటే ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాల్సి ఉంది. అయితే అదేమీ చేయకపోవడం ఉపాధ్యాయుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. వైద్యులే తెలుసుకుని వచ్చి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ట్యాంకులను గుర్తించి శుభ్రపరిచారు.

డీఎంఅండ్‌హెచ్ఓ ఆరా

కడప అర్బన్ : విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై డీఎంహెచ్ఓ విచారణ తీవ్ర అస్వస్థతతకు గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల పరిస్థితిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు ప్రత్యక్షంగా విచారణ చేశారు. ఈ సంఘటన ఆయన దృష్టికి రాగానే వెంటనే సోమవారం సాయంత్రం రిమ్స్‌కు చేరుకుని విద్యార్థినుల పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు.

కాచి చల్లార్చిన నీరు తాగండి

నీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటం, పెద్ద ఎత్తున పాచి నిల్వ ఉండటం, ట్యాంకులపై కప్పు లేక పోవడం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే క్లోరినేషన్ చేయించాం. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించాం. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించాం.

డాక్టర్ ఆయిషా సుల్తానా, ఖాజీపేట వైద్యాధికారి

టీడీపీ ప్రభుత్వం వాగ్దానాలు నెరవేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో రెండు రోజుల సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించారన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు నేడు సీఎంగా నెరవేర్చాలని కోరారు. ప్రత్యేక హోదా విభజన హామీల్లో భాగంగా ఇచ్చిన కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు అలా డిమాండ్ చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, జి.శివకుమార్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, బి.దస్తగిరి రెడ్డి, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌పై దాడి

మదనపల్లె : కారు డ్రైవర్‌పై అతడి స్నేహితులే దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి పట్టణంలో జరిగింది. అనపగుట్టకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు లక్ష్మీపతి(28) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అమ్మచెరువుమిట్ట వద్ద ఇంటికి వస్తుండగా, వ్యక్తిగత కక్షలతో అతడి స్నేహితులు శంకర, బాలకృష్ణ దాడికి పాల్పడ్డారు. ఒ(టి)రికి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జిల్లా బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం పక్కీరుపల్లెలోని పీవీఆర్ బ్యాడ్మింటన్ ఎరీనాలో ఆదివారం రాత్రి నిర్వహించిన బ్యాడ్మింటన్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఎంపికలకు బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారుడు, జిల్లా న్యాయమూర్తి పి. రామారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, అంకితభావంతో పాటు రెగ్యులారిటీ ముఖ్యమన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యేందుకు పూర్తి స్థాయి ప్రదర్శన కనబరచాలని సూచించారు. బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కోశాధికారి, జాతీయ రెఫరీ నాగరాజు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే సీనియర్ విభాగం క్రీడాకారులు ఆగస్టు నెలలో విజయనగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. జూనియర్ విభాగం క్రీడాకారులకు శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. అనంతరం అండర్–19 సింగిల్స్, డబుల్స్ విభాగాలు, సీనియర్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్లీడర్ శంకర్‌రెడ్డి, పీవీఆర్ స్టేడియం అధినేత విశ్వనాథరెడ్డి, రెఫరీలు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు.. (వరుసగా విన్నర్స్, రన్నర్స్,రిజర్వ్)..

అండర్–19 బాలురు : పి. బాబురాహుల్, జి. ప్రవీణ్, బి.పవన్‌రెడ్డి, ఎస్.జశ్వంత్. **అండర్–19 బాలుర డబుల్స్ :** బి. సులేమాన్‌ఖాన్–సాయినవనీత్‌దత్త. **అండర్–19 బాలికలు :** ఆర్. రెడ్డిపద్మిణి, జి.పూజిత, వి.రమ్యశ్రీ. **అండర్–19 బాలికల డబుల్స్ :** వి. రమ్యశ్రీ–పి.యజ్ఞశ్రీ. **పురుషుల విభాగం :** కె. కోటేశ్వరరెడ్డి, పి.బాబారాహుల్, కె. ప్రణీత్‌రాజ్, హెచ్.శివకుమార్. **పురుషుల డబుల్స్ విభాగం :** కె.ప్రణీత్‌రాజ్–ఎస్.అబ్దుల్‌రెహమాన్. **మహిళల సింగిల్స్ :** జి.పూజిత, ఆర్.రెడ్డిపద్మిణి.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : నూతన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో 'భారతీయ నూతన చట్టాలపై అవగాహన సదస్సు'ను కడప కేంద్ర కారాగారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారతీయ న్యాయ సన్నిహిత– 2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత –2023, భారతీయ అధీనియం మొదలైన చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. చట్టాలను గౌరవించడం మనందరి బాధ్యతన్నారు. కడప న్యాయవాది డి. సాయి వంశీకృష్ణ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

- కడప కేంద్ర కారాగారంలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు.
- జైళ్లలో వున్న బాలనేరస్థులను గుర్తించడం, న్యాయసహాయం అందించడం కోసం పాన్ ఇండియా ప్రచారం –2024పై విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు.

ఈ కార్యక్రమంలో కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఐఎస్‌హెచ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు, ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్ కృష్ణవేణి, వైద్యాధికారులు వినయ్‌బాబు, నవీన్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, పారా లీగల్ వలంటీర్‌లు న్యాయవాదులు, ఖైదీలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 20లక్షలు చెక్కు అందజేత



కానిస్టేబుల్ సత్యకుమార్ సతీమణి రాజేశ్వరికి చెక్కును అందజేస్తున్న కమాండెంట్ రవిశంకర్

సిద్ధవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యకుమార్ గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి సోమవారం రూ. 20 లక్షల నగదు చెక్కును అందజేశామని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటు పి. రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్ కానిస్టేబుల్ సత్యకుమార్ గత ఏడాది డిసెంబర్ 5వ తేదీ తెల్లవారు జామున చెన్నూరు నుంచి బైక్‌పై బెటాలియన్‌లో విధులు నిర్వహించేందుకు వస్తుండగా భాకరాపేట సమీపంలోని మలినేనిపట్నం వద్ద చెట్టు విరిగి బైక్‌పై పడిందన్నారు. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలై మృతి చెందాడన్నారు. అతనికి రావాల్సిన వ్యక్తిగత ప్రమాద బీమా రూ. 20 లక్షల నగదు చెక్కును ఆయన సతీమణి రాజేశ్వరికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి. నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ పి.ఎస్.డి. ప్రసాద్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మురళినాయక్, రాజంపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎస్. విజయ్‌వర్ధన్, భాకరాపేట ఎస్‌బీఐ మేనేజర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



మృతిచెందిన ఉపాధ్యాయుడు బాలక్రిష్ణయ్య

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల కుమ్మరికొట్టాలు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పోరుమామిళ్ల మండలం సూరిసిద్దుపల్లె గ్రామానికి చెందిన గొడ్లవీటి బాలక్రిష్ణయ్య (47) బి.మఠం మండలం పెద్దిరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన బద్వేలు పట్టణంలోని సురేంద్రనగర్‌లో నివసిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రోజూ మాదిరే విధులకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత 7–30 గంటల సమయంలో మినరల్ వాటర్ తీసుకువచ్చేందుకు నడుచుకుంటూ రోడ్డుపై వెళుతుండగా బద్వేలు నుండి చెముడూరుకు వెళుతున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఎన్నికలు సక్రమంగా నిర్వహించిన యంత్రాంగానికి కృతజ్ఞతలు



కలెక్టర్, జేసీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వివిధ పార్టీల నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో గత మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు భంగం కలగకుండా నిర్వహించిన జిల్లా యంత్రాంగానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ లక్ష్మణరావు(బీజేపీ), ప్రతాప్‌రెడ్డి(టీడీపీ), సుధాకర్‌రెడ్డి(కాంగ్రెస్), మనోహర్(సీపీఎం), శ్రీనివాసులు(ఆమ్ ఆద్మీ) పాల్గొన్నారు.

విద్యార్థికి గాయాలు

మదనపల్లె : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు పి.గణేష్(20) అంగళ్లలోని గోల్డెన్‌వ్యాలీ కళాశాలలో డిప్లమా మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం కళాశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా, అంగళ్ల సమీపంలో టూవీలర్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, కారు ఢీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం కడప–రేణిగుంట జాతీయ రహదారి పోలుబుచ్చయ్యగారిపల్లి గ్రామం, అంజనేయస్వామి గుడి సమీపంలో ఇరుకు కనుమ బోటు వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఆరెంజ్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, కడప నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న చంద్రఓబులేసు (38), హర్షద్ (28), అఫ్తాబ్ (28)లకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం ద్వారా ఒంటిమిట్ట పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బస్సు ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపించారు.

ఆటోలు ఢీ

వృద్ధురాలి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కరీమున్నీసా

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి పొద్దుపోయాక జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పఠాన్ కరీమున్నిసా ఉరఫ్ ఖదీరున్ (82) మృతి చెందగా, పఠాన్ మస్తాన్ బీ, షావలీలకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కడప నగరానికి చెందిన కరీమున్నిసా, పఠాన్ మస్తాన్‌బీ, షావలీ కలిసి ఏపీ 04 టీటీ 8921 ఆటోలో కడప నుంచి చిన్నమండెంకు బయలుదేరారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే రామాపురం వైపు నుంచి వస్తున్న ఏపీ39టీఎఫ్ 5921 ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కరీమున్నిసా సోమవారం మృతి చెందింది. పఠాన్ మస్తాన్‌బీ తలపై తీవ్ర గాయాలు కాగా, షావలీకి కాలు విరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల ఎస్ఐ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం

మదనపల్లె : మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన రెండు ద్విచక్రవాహనాలను రాయచోటి పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన ఏ.భానుప్రకాష్(46) ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనం జనవరిలో చోరీకి గురైంది. అదేవిధంగా మే 21న కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ దాదంవారిపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి కుమారుడు యుగంధరరెడ్డి(47) హోండా షైన్ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఆయా చోరీలపై కేసులు నమోదుచేసి, విచారణ చేస్తున్న క్రమంలో రాయచోటి పోలీసులకు నిందితులు దొరకడంతో వారి నుంచి వాహనాలు రికవరీ చేసుకున్నట్లు తెలిపారు.

